చివరి రక్తపు బొట్టు వరకు
# బీసీల కోసమే
» ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
» నాగర్‌కర్నూల్‌లో బీసీ జన చైతన్య సభ
7

## ఆంధ్రజ్యోతి బంపర్ డ్రా విజేతలకు..
# బహుమతుల ప్రదానం

» ప్రథమ బహుమతి బైక్.. » ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్
» తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన బంపర్ డ్రా విజేతలకు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని యూనిట్ ఆఫీస్‌లో బ్రాంచ్ మేనేజర్ సి.చంద్రశేఖర్ రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నోముల రవీందర్‌రెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుతులను అందజేశారు. గత నెల 22న మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బంపర్ డ్రాలో విజేతలను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి(మోటర్ బైక్)ని అయిజ పట్టణానికి చెందిన రామకృష్ణ గెలుపొందగా, ద్వితీయ బహుమతిని(రిఫ్రిజిరేటర్) గద్వాలకు చెందిన ఎండీ మస్తాన్, తృతీయ బహుమతి(ఎల్‌ఈడీ టీవీ)ని నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రిటైర్డ్ వీఆర్‌వో ప్రభాకర్ రెడ్డి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా బీఎం చంద్రశేఖర్ రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నోముల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి' పాఠకుల కోసం 22 ఏళ్లుగా బంపర్ డ్రాను నిర్వహిస్తోందన్నారు. డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులను అందిస్తున్నామన్నారు. పాఠకుల నుంచి బంపర్ డ్రాకు విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో విజేతలతో పాటు ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ మేనేజర్ చందు, సర్క్యులేషన్ మేనేజర్, ఫొటో జర్నలిస్టు రవికుమార్, వీడియో జర్నలిస్టు సంతోష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 14 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రికను చదువుతున్నాను

నేను 14 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రికను క్రమం తప్పకుండా చదువుతున్నాను. ఈ పత్రిక ప్రజల పక్షాన నిష్పక్షపాతంగా వార్తలు అందిస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కథనాలను ప్రచురిస్తోంది. నాకు ప్రథమ బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది.

- రామకృష్ణ, అయిజ,
ప్రథమ బహుమతి విజేత

### ఆంధ్రజ్యోతిలో వచ్చే ఆర్టికల్స్ అంటే ఇష్టం

నాకు ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చే ఆర్టికల్స్ అంటే ఎంతో ఇష్టం. నేను వృత్తిరీత్యా బిజీగా ఉన్నప్పటికీ.. పత్రికలో వచ్చే అన్ని ఆర్టికల్స్ చదువుతాను. పవిత్ర రంజాన్ మాసంలో ఆంధ్రజ్యోతి పత్రిక నిర్వహించిన బంపర్ డ్రాలో నాకు రిఫ్రిజిరేటర్ బహుమతిగా రావడం సంతోషంగా ఉంది. దానిని మా ప్రాంతంలోని మసీద్‌కు డొనేట్ చేశాను.

- ఎండీ మస్తాన్, గద్వాల,
ద్వితీయ బహుమతి విజేత

### ఉద్యోగ జీవితంలో ఎంతో ఉపయోగ పడింది

నేను రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసే క్రమంలో ఆంధ్రజ్యోతి పత్రిక ఎంతో ఉపయోగపడింది. ఉన్నతాధికారుల పర్యటన వివరాలు, గ్రామాలలో ఉన్న సమస్యలు నాకు పత్రిక ద్వారానే తెలిసేవి. బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది.

- ప్రభాకర్ రావు, నాగర్‌కర్నూల్,
రిటైర్డ్ వీఆర్‌వో, తృతీయ బహుమతి విజేత



ప్రథమ బహుమతి విజేతకు చెక్కును అందిస్తున్న బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి



ద్వితీయ బహుమతి విజేతకు ఫ్రిజ్‌ను అందజేస్తున్న ఆంధ్రజ్యోతి బీఎం చంద్రశేఖర్ రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నోముల రవీందర్ రెడ్డి



తృతీయ బహుమతి విజేతకు టీవీ అందిస్తున్న ఆంధ్రజ్యోతి బీఎం చంద్రశేఖర్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ చందు

## చిగురిస్తున్న
# ఆశలు

» భూ భారతిలో సాదాబైనామాల పరిష్కారానికి హామీ
» ఉమ్మడి పాలమూరులో 29,375 పెండింగ్ దరఖాస్తులు
» దరఖాస్తు చేసుకొని ఐదేళ్లుగా రైతుల ఎదురుచూపులు
» పరిష్కారం బాధ్యత ఆర్డీవోలకు
» చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత కార్యాచరణ



విత్తనాలు వేస్తున్న రైతు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ భారతి చట్టం ద్వారా సాదాబైనామాల దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం కనిపిస్తోంది. ధరణి అమల్లోకి వచ్చిన తర్వాత సాదాబైనామాల దరఖాస్తులు తీసుకున్నప్పటికీ.. ఆ పోర్టల్‌లో పరిష్కారానికి ఆప్షన్ లేకపోవడంతో దాదాపు అయిదేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చింది. దాని అమలు కోసం పలు మండలను పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. ఆ మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించి, రైతుల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా భూమి కొనుగోలు పద్ధతి రిజిష్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా ఉంటుంది. కొనుగోలు చేసిన వ్యక్తి సదరు డాక్యుమెంట్‌ను చూపించి.. అమ్మిన వ్యక్తి నుంచి భూ హక్కులను పొందుతారు. అయితే గతంలో రైతులకు రిజిష్టర్డ్ డాక్యుమెంట్లపై అవగాహన లేని సమయంలో సాదాబైనామాలు(తెల్లకాగితం)పై ఒప్పందం చేసుకుని, భూమిని తమ స్వాధీనంలోకి తీసుకునే వారు. మోఖాపై భూమిని స్వాధీన పరుచుకున్నప్పటికీ.. కాగితాల్లో మాత్రం అమ్మినవారు మాత్రమే యజమానులుగా ఉండేవారు. అవగాహన ఉన్న వారు

-మిగతా 6లో..



భూ భారతి కింద పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మద్దూరు తహసీల్దార్ కార్యాలయం

### కొత్త చట్టం..
### పరిష్కార మార్గం

ధరణి వచ్చిన తర్వాత చిన్నసన్నకారు రైతులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యల్లో సాదాబైనామాలు కూడా ఒకటి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ప్రభుత్వం నిర్దేశించిన గడువు ప్రకారం 29,375 మంది రైతులు సాదాబైమనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ అందుకు నోచుకోకపోవడం కూడా ధరణి పట్ల విముఖతకు, దాన్ని రద్దు చేయడానికి కారణమైందని చెప్పొచ్చు. కొత్త చట్టంలో సెక్షన్ 6, రూల్ 6 ప్రకారం సాదాబైనామాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా 2014 జూన్ 2 కంటే ముందు సాదాబైనామాల ద్వారా భూమి కొనుగోలు చేసి, 12 ఏళ్లుగా స్వాధీనంలో ఉండటంతో పాటు గతప్రభుత్వం నిర్దేశించిన గడువులో దరఖాస్తు చేసుకున్నవారి నుంచి ఆర్డీవోలు విచారణ చేసి.. చుట్టు పక్కల రైతులతో మాట్లాడతారు. పీవోటీ, సీలింగ్, ఎల్‌టీఆర్ చట్టాల ఉల్లంఘన లేదని నిర్ధారించుకున్న తర్వాత, అర్హత ఉన్న రైతుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఆ తర్వాత హక్కుల రికార్డులో నమోదు చేసి, పాసుపుస్తకం జారీ చేస్తారు. ధరణిలో సాదాబైనామాల కోసం నిబంధన లేనందున హైకోర్టు వీటి క్రమబద్ధీకరణపై గతంలో స్టే విధించింది.

ఊర్కొండపేట ఘటనపై
## సీన్ రీకన్‌స్ట్రక్షన్
» నిందితుల దుస్తులు, బైకులు, నగదు స్వాధీనం
7



గద్వాల అడ్డాగా..
# డ్రగ్స్ మాఫియా
» పట్టణంలోని షేరెల్లివీధి, చింతలపేట, గంజిపేటలలో జోరుగా విక్రయాలు
» 50 మంది దాకా పెడ్లర్లు ఉన్నట్లు అంచనా
» ఇప్పటికే పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు..?
» రాయిచూర్, హైదరాబాద్ నుంచి గంజాయి సిగరెట్లు కొనుగోలు
» కొన్ని టీ స్టాళ్లతో పాటు కాలనీలలో సరఫరా
6

మంత్రి పర్యటనకు
# పకడ్బందీ ఏర్పాట్లు



ధరూర్‌లో మంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

● సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్,

ధరూరు/నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులో భాగంగా నేడు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో ధరూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సభా స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్పీ శ్రీనివాస రావులు పరిశీలించారు.

**నేడు ధరూర్, నాగర్‌కర్నూల్‌కు మంత్రి పొంగులేటి**

ధరూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలం వద్ద నిర్వహించే భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులో పాల్గొనేందుకు శనివారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉదయం 8.05 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి 8.50 గంటలకు గద్వాల ఐడీవోసీ పీజేపీ క్యాంపు వద్ద గల హెడిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 9.15 గంటలకు ధరూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే అవగాహన సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లనున్నట్లు తెలిపారు. 11:20 గంటలకు నాగర్‌కర్నూల్‌కు చేరు కొని గగ్గలపల్లి శివారులోని తేజ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే భూభారతి అవగాహన సదస్సులో పాల్గొంటారు. కార్యక్రమానికి ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, నారాయణరెడ్డి హాజరవుతారు.

## నేటితో తవ్వకాలు పూర్తి!

» కొనసాగుతున్న సహాయక చర్యలు
» టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
» లభించని ఆరుగురు కార్మికుల ఆచూకీ
» డీబీఎం పద్ధతిలో తవ్వకాలకు నిర్ణయం
» పర్యావరణ అనుమతుల కోసం ప్రత్యేక కమిటీ



ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో తవ్వకాలు చేపడుతున్న యంత్రాలు
6

# వైభవం కోల్పోతున్న కీర్తి కిరీటం



వనపర్తి రాజాగారి బంగ్లా



గచ్చు ఊడిపోవడంతో రాళ్లు తేలిన బంగ్లా బేస్‌మెంట్
6

'అపార్' నమోదు..
# అంతంత మాత్రమే
» వనపర్తి జిల్లాలో 50 శాతం దాటని విద్యార్థుల సంఖ్య



హెచ్‌ఎంలు, ఎంఈవోలకు అపార్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతీ విద్యార్థికి ఆధార్ కార్డు తరహాలో అపార్‌కార్డు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు వన్ నేషన్ వన్ స్టూడెంట్ లక్ష్యంతో 12 అంకెలతో కూడిన అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) సంఖ్యను కేటాయించాలని నిర్ణయించారు. కానీ ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో అవాంతరాలు ఎదురవుతున్నాయి.

### సగం కూడా పూర్తి కాని అపార్ కార్డుల జారీ

వనపర్తి జిల్లాలో 716 పాఠశాలల్లో దాదాపు 95,395 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 51,520 మంది విద్యార్థుల పేరు, పుట్టిన తేదీ, బయోమెట్రిక్ కలిగి ఉండడంతో అపార్ నమోదుకు అర్హత సాధించారు. ఇందులో ఇప్పటి వరకు 43,659 మంది విద్యార్థులకు అపార్ సంఖ్యను కేటాయించారు. ఇది మొత్తం 95,395 విద్యార్థులతో చూసుకుంటే అపార్ సంఖ్యను కేటాయించింది కేవలం 45.80 శాతం మంది విద్యార్థులకు మాత్రమే. మిగతా 55 శాతం మంది విద్యార్థులకు అపార్ సంఖ్య కేటాయించలేదు. విద్యార్థుల ఆధార్ కార్డులో పేర్లు తప్పులు ఉండటం, పుట్టిన తేదీ, బయోమెట్రిక్ అందుబాటులో లేకపోవడంతో అపార్ సంఖ్యను కేటాయించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### అపార్ సంఖ్యతో ప్రయోజనాలు

విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేసేందుకు చైల్డ్ ఇన్ఫో వెబ్‌సైట్‌లో పాఠశాలలకు ప్రత్యేక ఐడీలు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం వీటి ఆధారంగానే అపార్ సంఖ్యను కేటాయిస్తుంది. ఇది ఆధార్ కార్డు తరహాలోనే శాశ్వతంగా వినియోగంలో ఉంటుంది. విద్యార్హతలు, మార్కులు, గ్రేడ్‌లు సాధించిన ప్రగతి, ఉపకార వేతనాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు కుటుంబ సభ్యుల వివరాలను పొందుపరుస్తారు. పోటీ పరీక్షలకు పైచదువులు చదవడానికి ఈ డిజిటల్ పత్రాలను ప్రామాణికంగా తీసుకుంటారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు అందుబాటులో లేకున్నా భయపడాల్సిన పని లేదు. ఇలా ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ అపార్ కార్డుల జారీకి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేసింది కేంద్ర ప్రభుత్వం.

### 100 శాతం పూర్తి చేస్తాం



జిల్లాలోని విద్యార్థులందరికీ అపార్ సంఖ్య కేటాయించే విషయంపై ఇప్పటికే హెచ్‌ఎంలకు అవగాహన కల్పించాం. విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోవడం ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ తప్పు ఉండటంతో అపార్ సంఖ్య కేటాయింపునకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- అబ్దుల్ ఘని, ఇన్‌చార్జి డీఈవో

తలాపున కృష్ణమ్మ..
# తాగునీరు లేదమ్మా!

» దోమలపెంట, ఈగలపెంట ప్రజల ఆవేదన
» ఆరేళ్లుగా కొనసాగుతున్న 'మిషన్ భగీరథ' పనులు
» యాభై ఏళ్లుగా నెట్టుకొస్తున్న అధికారులు
» పగిలిన పైపులు, పాకర పట్టిన సంపులు
» పది రోజులకు ఒకసారి నీటి సరఫరా
7

దోమలపెంటలో దాతలు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు




ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్‌టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

## ఎమ్మెల్యే వంశీకృష్ణకు పరామర్శ

- త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలి
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను పరామర్శిస్తున్న మీనాక్షీ నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ , వంశీచంద్‌రెడ్డి

అచ్చంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ పరామర్శించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న ఆయనను శుక్రవారం కలిసి మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆమె వెంట టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథ్, విష్ణునాథ్, ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీ వంశీచందర్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఉన్నారు.

## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన సీతాదయాకర్‌రెడ్డి



మీనాక్షీనటరాజన్, మహేష్ కుమార్‌గౌడులతో సీతాదయాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడుతో పా టు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో తెలం గాణా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిసన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై వారితో సమీక్షించారు.



పెచ్చులూడుతున్న రాజప్రసాదం ప్రాకారాలు



తెల్లగా ఉండాల్సిన బంగ్లా పరిరక్షణ లేకపోవడంతో కళావిహీనంగా మారిన గోడలు

# వైభవం కోల్పోతున్న కీర్తి కిరీటం

- పెచ్చులూడుతున్న వనపర్తి రాజ ప్రాసాదం
- భవనం అభివృద్ధికి 2023లో రూ. 22 కోట్లు
- నిధులు మంజూరైనా మొదలు కాని పనులు
- 1970లో ప్రభుత్వ పరం చేసిన సంస్థానాధీశులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గత వైభవానికి చిహ్నంగా నిలిచిన రాజ ప్రాసాదం కళాకాంతులను కోల్పోతోంది. వనపర్తి అంటేనే ప్రతీ ఒక్కరికి టక్కున గుర్తుకొచ్చేది రాజాగారి బంగ్లా. సంస్థానాధీశులు నిర్మించిన ఈ బంగ్లా ప్రస్తుతం వనపర్తి జిల్లా చిహ్నంగా ఉంది. అంతటి ఘనకీర్తి కలిగిన బంగ్లా నేడు కళావిహీనంగా మారుతుండటం ప్రజలను ఆవేదనకు గురి చేస్తోంది. సరైన నిర్వహణ, ఆదరణ లేకపోవడంతో భవనం రూపురేఖలు దెబ్బతింటున్నాయి. పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరుకుంటోంది. వనపర్తి సంస్థానాధీశులు 18వ శతాబ్దంలో ఈ భవనాన్ని నిర్మించారు. ఎంతో సుందరీకరంగా, మైసూరు ప్యాలేస్‌ను గుర్తుకు తెచ్చేలా నిర్మించిన ఈ భవనం చరిత్రకు సాక్షిగా నేటికీ సందర్శకులను ఆకర్షిస్తోంది. ఈ భవనంలో సంస్థానాధీశుడు రాజా రామేశ్వరరావు పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. 1959లో తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను వనపర్తికి ఆహ్వానించి, ఆయన చేతుల మీదుగా కృష్ణదేవరాయల పేరుతో కళాశాలను ప్రారంభింపచేశారు. ఆ తర్వాత 1970లో బంగ్లాను ప్రభుత్వపరం చేశారు.

### శిథిలమవుతున్న చారిత్రక కట్టడం

సంస్థానాధీశుల కాలంలో సువిషాల ప్రదేశంలో ఈ భవనాన్ని సుందరంగా నిర్మించారు. బంగ్లా ముఖద్వారం, ముందు వైపు ఇరువైపులా గుండ్లటి ఆకృతిలో మెట్లు, వాటి ముందు సింహాల ప్రతిమలతో ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భవన నిర్మాణానికి రాళ్లు, గచ్చును వినియోగించారు. పూర్తిగా తెల్లరంగులో మెరిసిపోతూ ఉండేది. గత వైభవానికి నిదర్శనంగా ఉండాల్సిన ఈ రాజ ప్రాసాదం సరైన ఆదరణ లేకపోవడంతో రోజురోజుకూ శిథిలం అవుతోంది. గచ్చు, పెచ్చులు ఊడిపోయి రాళ్ల సీకులు, తేలుతున్నాయి. సంస్థానాధీశులు దశాబ్దాల పాటు పరిపాలనా వ్యవహారాలు సాగించిన ఈ భవనం, ఆ తర్వాత ఎంతో మందికి విద్యాదానం చేసిన బంగ్లా నేడు ప్రమాదం అంచుల్లోకి చేరుతోంది. ఈ నేపథ్యంలో కొందరు పట్టణవాసులు భవన పరిరక్షణకు ఉద్యమించారు. దీంతో 2023లో ప్రభుత్వం రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేసింది.

### నిధులున్నా నిరుపయోగమేనా..?

గత ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి రూ. 22 కోట్లను మంజూరు చేసింది. అందులో పాలిటెక్నిక్ కళాశాల భవన సుందరీకరణ, మరమతు కోసం రూ.13.40 కోట్లు, బాలికలు, బాలుర వసతి గృహాల నిర్మాణానికి రూ. 8.60 కోట్లు కేటాయించారు. వసతి గృహాల నిర్మాణం కోసం గత ఏడాది ఫిబ్రవరిలో టెండర్లు పిలిచినట్లు సమాచారం. దీంతో పాటు ఇతర వసతుల ఏర్పాటుకు మరో రూ. 3.80 లక్షలు అదనంగా మంజూరు అయ్యాయి. కానీ ఇప్పటి వరకు అభివృద్ధి పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

### రాజా ప్రాసాదాన్ని రక్షించాలి



వనపర్తి రాజ ప్రాసాదం నేడు ప్రమాదంలో ఉంది. ప్రజల కోరిక మేరకు అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేపట్టాం. ఫలితంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు వెంటనే స్పందించి మంజూరైన నిధులతో పనులు చేపట్టాలి. వచ్చే విద్యాసంవత్సరంలో వసతి గృహాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి.

- సతీష్ యాదవ్, అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

## చిగురిస్తున్న ఆశలు

(5వ పేజీ తరువాయి)

కాగితాల్లో మాత్రం అమ్మినవారు మాత్రమే యజమానులుగా ఉండేవారు. అవగాహన ఉన్న వారు తహసీల్దార్ కార్యాలయాల్లో భూ హక్కులను కూడా బదలాయించుకునేవారు. కానీ అవగాహన లేమితో.. కొందరు రైతులు భూమిని మాత్రమే స్వాధీనపరుచుకునేవారు. హక్కుల బదలాయింపు జరిగేది కాదు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సాదాబైనామాల ద్వారా కొంతమంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, చాలామంది అలాగే మిగిలిపోయారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న చాలామంది రైతులు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.

### ఎల్ఆర్‌యూపీ తర్వాత ఇబ్బందులు..

రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం ల్యాండ్ రికార్డ్ అప్డేషన్ ప్రోగ్రాం(ఎల్ఆర్‌యూపీ)ని తెచ్చింది. ఇందులో భాగంగా అన్ని రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ధరణి చట్టం ద్వారా కొత్త పాసు పుస్తకాలు జారీ చేసింది. ఆ సమయంలో చాలా పొరపాట్లు జరిగాయి. భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు రావడం, ఒకరి సర్వే నెంబర్‌లోని భూమి మరొకరికి రావడం వంటివి జరిగాయి. కాస్తు కాలం ఎత్తివేయడంతో అనుభవంలో ఉన్నవారు అధికారికంగా హక్కులు కోల్పోయి, పట్టదారుల పేరుపై పాస్ బుక్కులు రావడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కాస్తుదారు కాలంలో ఉన్నవారితోపాటు, సాదాబైనామాల ద్వారా ఆస్తులు కొనుగోలు చేసిన వారు కూడా తర్వాత ఇరకాటంలో పడ్డారు. భూమి అమ్మిన వారు తిరిగి అవి తమ ఆస్తులను క్లెయిమ్ చేసి.. కోర్టులకు వెళ్లడం వంటి సమస్యలు చాలా ఉత్పన్నమయ్యాయి. అప్పటి ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి, 2014 జూన్ 2 రాష్ట్రం ఏర్పడేనాటి కంటే ముందు గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూమిని సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసి, 12 ఏళ్ల మోఖాపై ఉన్నవారికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. 10 అక్టోబరు 2020 నుంచి 11 నవంబరు 2020 వరకు ఈ దరఖాస్తులను స్వీకరించింది. అయితే ధరణిలో మాత్రం వాటి పరిష్కారానికి ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో ఐదేళ్లుగా అటు యజమానులకు, ఇటు కాస్తుదారులకు మధ్య వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి.

# నేటితో తవ్వకాలు పూర్తి!

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
- లభించని ఆరుగురు కార్మికుల ఆచూకీ
- డీబీఎం పద్ధతిలో తవ్వకాలకు నిర్ణయం
- పర్యావరణ అనుమతుల కోసం ప్రత్యేక కమిటీ

దోమలపెంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద సంఘ టనా ప్రాంతంలో తవ్వకాలు నేటితో ముగియనున్నట్లు సమాచారం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొండ రాళ్లు, బుర ద, మట్టి, సిమెంట్ సెగ్మెంట్ బ్లాకులు కూలిపడటం, శి థిలాల కింద టీబీఎం కూరుకుపోవడం తవ్వకాలకు ఆటంకంగా మారింది. ఈ క్రమంలో కన్వేయర్ బెల్టును మూడవ సారి 13.730 కిలోమీటర్ల నుంచి 13.800 మీటర్ల వరకు పునరుద్ధరించారు. ఆ తర్వాత 100 మీటర్ల మేర శిథిలాలను తొలగించాల్సి ఉన్నది. గత నెల 24న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో వివిధ శాఖలకు చెందిన రెస్క్యూ బృందాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సొరంగంలో చిక్కుకున్న ఆరుగురు కార్మికుల ఆచూకీని గుర్తించేందుకు ఈ నెల 18 వరకు మిగిలిన శిథిలాలను పూర్తిగా తొలగించాలని గడువు విధించారు. అనుకున్న విధంగానే రెస్క్యూ బృందాలు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. శుక్రవారం రాత్రి లేదా, శనివారం మధ్యాహ్నం వరకు శిథిలాలను పూర్తిగా తొలగించేందుకు కృషి చేస్తున్నారు.

### డీ1, డీ2 ప్రాంతాల మధ్య తవ్వకాలు

టన్నెల్ ప్రమాదం జరిగి నేటికి 57 రోజులు గడిచాయి. నాటి నుంచి రెస్క్యూ బృందాలు సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రెస్క్యూ బృందాల అధికారులతో ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశం నిర్వహించి, వివిధ అంశాలపై చర్చించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో ఇప్పటికే ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికి తీశారు. మిగిలిన ఆరుగురి ఆచూకీ కోసం డీ1, డీ2 ప్రాంతాల మధ్య తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం డీ2 ప్రాంతంలో కన్వేయర్ బెల్ట్ బంకర్ వరకు బురద, మట్టి, తవ్వకాలు, టీబీఎం విడి భాగాలను కత్తిరింపు పనులు కొనసాగుతున్నాయి. అందుకు 5 ఎక్స్‌కవేటర్లు నిరంతరం పనిచేస్తున్నాయి. శిథిలాలను కన్వేయర్ బెల్టు, లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలించడంతో పాటు, నీటి ఊటను బయటకు పంపింగ్ చేస్తున్నారు. సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఇరిగేషన్, జెపీ కంపనీ, ర్యాట్ హోల్ మైనర్స్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



లోకో ట్రైన్‌లో శిథిలాలను బయటకు తరలింపు

### వెనుదిరుగుతున్న రెస్క్యూ బృందాలు

సొరంగంలో శిథిలాల తవ్వకాలు, తరలింపు పనులు చివరి దశకు చేరడంతో వివిధ శాఖల చెందిన రెస్క్యూ సిబ్బంది వారి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత 40 రోజుల వరకు నిత్య మూడు షిఫ్టలలో దాదాపు 800 మంది వరకు సహాయక చర్యలో పాల్గొన్నారు. ప్రస్తుతం 200 వందల మంది మాత్రమే పని చేస్తున్నారు. సొరంగంలో మనుషల కన్నా, యంత్రాలతోనే ఎక్కువ పనులు జరుగుతుండటం, తవ్వకాలు ముగింపు దశకు చేరడంతో సిబ్బంది వారి స్వస్థలాలకు వెళ్లి విధుల్లో చేరుతున్నట్లు అధికారులు చెప్తున్నారు.

### ఆరుగురు కార్మికులు అక్కడేనా..?

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఫిబ్రవరి 22న జరిగిన దుర్ఘటనలో 8 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. డీ2 ప్రాంతంలో మార్చి 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం బయట పడింది. 13.860 కిలోమీటర్ ప్రాంతంలో మార్చి 25న ప్రాజెక్టు ఇంజనీరు మనోజ్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. మిగిలిన ఆరుగురు కార్మికుల ఆచూకీ కోసం 100 మీటర్ల మేర పేరుకున్న శిథిలాలను తిరుగతోడి బయటకు తరలించారు. డీ1 నుంచి 43 మీటర్ల ముందు ప్రమాదకర ప్రాంతంగా గుర్తించి ఇనుప కంచె వేశారు. డీ1 నుంచి 25 మీటర్ల ముందుకు మిగతా ఆరుగురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకొని ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిషేధిత ప్రాంతంగా గుర్తించిన చోట ఇప్పట్లో తవ్వకాలు జరుపడం అసాధ్యమని రెస్క్యూ బృందాల అధికారులు చెప్తున్నారు.

### టెక్నికల్ కమిటీ ఏర్పాటు

ఇన్‌లెట్-1 దోమలపెంట నుంచి 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం సంభవించింది. ఇక ముందు సొరంగాన్ని తొలిచేందుకు డీబీఎం పద్ధతిని అవలంబించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సొరంగ మార్గం అమ్రాబాద్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి కానున్నాయి. అందుకోసం పర్యావరణ అనుతులు పొందేందుకు ప్రభుత్వం రెండు రోజుల క్రితం 12 శాఖలకు చెందిన అధికారులతో టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఎన్‌డీఆర్ఎఫ్, సీఎస్ఐఆర్, జీఎస్ఐ, ఎన్‌సీఎస్, ఆర్మీ, పీసీసీఎఫ్, డిజాస్టర్ మెనేజ్‌మెంట్, ఎస్‌డీఆర్ఎఫ్, సీడీవో, కలెక్టర్, ఎస్పీ, ఎస్ఎల్‌బీసీ చీఫ్ ఇంజనీర్ ఉంటారు. కమిటీకి అనుసంధానంగా మరికొన్ని శాఖలు పని చేయనున్నాయి. ఎస్ఎల్‌బీసీ చీఫ్ ఇంజనీర్ నేతృత్వంలో కమిటీ కొనసాగనున్నది.



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రతేకాధికారి శివశంకర్ లోతేటి

## గద్వాల అడ్డాగా.. డ్రగ్స్ మాఫియా

- పట్టణంలోని షేరెల్లివీధి, చింతలపేట, గంజిపేటలో జోరుగా విక్రయాలు



డ్రగ్స్

గద్వాల క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా డ్రగ్ మాఫియాకు అడ్డాగా మారింది. జిల్లా కేంద్రంలోని కొందరుపె డ్లర్స్ (డ్రగ్స్‌ను విక్రయించేవారు) డ్రగ్స్‌ను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి యువకులతో విక్రయింపజేస్తూ లక్షలు గడిస్తున్నారు. గద్వాల పట్టణంలో కొందరు యువకులు గంజాయి సిగరెట్లతో పాటు గంజాయి ప్యాకెట్లను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇ క్కడి యువతకు అలవాటు చేస్తున్నారు.

### కర్ణాటక నుంచి కొనుగోలు..

జిల్లాకు చెందిన పెడ్లర్స్ కర్ణాటక జిల్లాలోని సోలాపూర్ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ ప్యాకెట్ల రూపంలో కొందరు యువతతో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కోగ్రామ్ రూ. 100కు తెచ్చి ఇక్కడ రూ. 500 నుంచి 600కు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. అలాగే రాయిచూర్, హైదరాబాద్, గోవా నుంచి గంజాయి సిగరెట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా వీరు లక్షలు గడిస్తూ యువతకు, మైనర్లకు డ్రగ్స్‌ను అలవాటు చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. పోలీసులు నిఘా వేస్తే ఆ యువకులను పట్టుకుంటారే తప్ప వారి వెనుక ఉన్న పెడ్లర్స్‌పై చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పట్టణంలో జోరుగా విక్రయాలు

జిల్లా కేంద్రంలోని షేరెల్లివీధి, చింతలపేట, గంజిపేట, పాత, కొత్తహౌసింగ్‌బోర్డు కాలనీతో పాటు గాంధీచౌక్ సమీపంలో గంజాయి సరఫరా చేసే పెడ్లర్స్ ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కోకాలనీలోనే దాదాపు 300 మందికి పైగానే యువకులు డ్రగ్స్ వాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పెడ్లర్స్‌పై పోలీసులు నిఘా పెడితే వారిని కాపాడేందుకు వెంటనే కొందరు నేతలు రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది.

### గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు, హుక్కా సరఫరా

గద్వాల జిల్లా కేంద్రంలో గంజాయి సిగరెట్లుతో పాటు ఇతర గంజాయి చాక్లెట్లు, హుక్కా వంటి మత్తు పదార్థాలు ఎక్కువగా యువత వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన బాలికల కిడ్నాప్ కేసులో ఉన్న ఓ యువకుడు గంజాయి వినియోగిస్తున్నట్లు సమాచారం. పట్టణంలోని టీ పాయింట్స్ దగ్గర సిగరెట్ తాగేవారిని సైతం తమ వైపుకు తిప్పుకుంటూ ఈ గంజాయి సిగరెట్లను అలవాటు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను పట్టణ పోలీసులు అ దుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనికి ప్రధా న సూత్రదారులు ఎంతమంది అనే విషయాలపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

### డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు



జిల్లాలో డ్రగ్స్ ను పూర్తిగా ని ర్మూలించేలా చ ర్యలు చేపడుతాం. డ్రగ్స్‌ను ఉ పయోగించే వారితో పాటు సరఫరా చేసేవారిపై నిఘా ఉంచాం. మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే విషయాలపై ఆరా తీస్తాం. యువత గంజాయికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. ప్రజలకు గంజాయి, ఇతర మాదకద్రవ్యా ల విషయం తెలిస్తే వెంటనే సమాచారం అందించాలి.

- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

## దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

పాన్‌గల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : దాడి సంఘటనపై వేర్వేరుగా ఇద్దరిపై కేసు నమోదైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మండలంలోని మాందాపూర్‌కి చెందిన మామిళ్లపల్లి చక్రవర్తి ఇంటి ఆవరణలో రాచూరి రేణుక, బోయ దేవమ్మల మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. ఇరువురిని సముదాయించే క్రమంలో గొల్ల రామకృష్ణ అనే వ్యక్తి చక్రవర్తి, వారి అమ్మపై రాయితో దాడి చేశాడు. చక్రవర్తికి స్వల్ప గాయాలు కాగా, వాళ్ల అమ్మకు తలకు బలమైన గాయమైనట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### మరో ఘటనలో

మండలంలోని మాందాపూర్‌లో శుక్రవారం గ్రామానికి చెందిన రాచూరి చెన్నమ్మ తమ్ముడైన రాముడికి అదే గ్రామానికి చెందిన దేవమ్మకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. రాచూరి చెన్నమ్మ చెల్లి అయిన రేణుక ఇంటి వద్ద వెళ్తున్న క్రమంలో దేవమ్మ భర్త బీసయ్య ఇద్దరు దాడి చేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి



పద్మ (ఫైల్)

కొల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నీళ్ల తాగేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన మహిళ బావిలో పడి మృతి చెందిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అంకిరావుపల్లి గ్రామంలో పద్మ (35) మధ్యాహ్నం నీళ్ల తాగడానికి వ్యవసాయ బావిలోకి దిగింది. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలోకి పడింది. ఈత రాకపోవడంతో ఆమె నీటిలో మునిగి మృతింది. మృతురాలికి భర్త కురుమయ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి అత్త నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రిషికేశ్ తెలిపారు.

## ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రిని కలిసిన గ్రామస్థులు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ముంపు గ్రామాల ప్రజలు

మక్తల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్, నేరడగం, అనుగొండ ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని జలసౌదలో ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రజలు కలిశారు. ఏళ్ల నుంచి ముంపు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కృష్ణానదిపై ఉన్న లిఫ్టులు పని చేయడం లేదని వాటికి మరమ్మతు చేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

## క్రైం కార్నర్

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


ఎల్లస్వామి (ఫైల్)

పెబ్బేరు/ పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెబ్బేరు మునిసిపాలిటీ 9వ వార్డుకు చెందిన చెటమోని ఎల్లస్వామి (38) గురువారం రాత్రి పొలంలో పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. జాతీయ రహదారిపై, రంగాపూర్ బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కారును స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని చంద్రకల్ బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల గ్రామానికి చెందిన బాలరాజు (27), పెద్దముద్దునూర్ గ్రామానికి చెందిన మల్లయ్యలు ద్విచక్రవాహనంపై చంద్రకల్ నుంచి పెదకొత్తపల్లికి బయలు దేరారు. జాతీయ రహదారిపైకి వస్తుండగా, కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వారిని ఢీకొన్నది. దీంతో బాలరాజు తీవ్రంగా గాయపడటంతో 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### బస్సు, ద్విచక్రవాహనం ఢీ

» ఒకరి మృతి


సంఘటనా స్థలంలో పడి ఉన్న ద్విచక్రవాహనం

కృష్ణ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు శివారులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మగనూరు మండలంలోని పెగడబండ గ్రామానికి చెందిన కుర్వ అంజప్ప (38) కర్ణాటక రాష్ట్రంలోని శక్తినగర్‌లో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా హైదరాబాద్ నుంచి రాయచూర్ వెళ్తున్న బస్సు ఢీకొనడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించి రాయచూర్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై అంజప్ప భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ నవీద్ తెలిపారు. అంజప్పకు భార్య, పదేళ్లలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

### మద్యపానం మానలేక యువకుడి ఆత్మహత్య

గద్వాల క్రైం/ ఆత్మకూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తాగుడు మానలేక ఓ యువ కుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఏకే బాలరాజు(30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం క్షీణించింది. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి వెళ్లాలని చెప్తున్నా అతడు వినలేదు. దీంతో ఆరోగ్యం మరింతగా క్షీణించింది. అయినా మద్యపానం మనలేక మనస్తాపానికి గురైన అతడు గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గద్వాల - శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

### ఊర్కొండపేట ఘటనపై సీన్ రీకన్‌స్ట్రక్షన్

ఊర్కొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం, ఊర్కొండపేటలో జరిగిన అత్యాచార ఘటనపై శుక్రవారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. గత నెల 29న ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి దైవదర్శనానికి వచ్చిన వివాహితపై ఏడుగురు దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసు విచారణలో భాగంగా, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. నిందితులు ఏడుగురు కాగా, ఉదయం మారుపాకుల అంజనేయులు గౌడ్, సాదిక్‌బాబా, సాయంత్రం మణికంఠ, కార్తీక్‌లను సంఘటనా స్థలానికి తీసుకొచ్చారు. నేరానికి పాల్పడిన తీరును, మొదటి నుంచి చివరి వరకు జరిగిన పరిణామాలను ఆరా తీశారు. సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ అంశాలపై నిందితులను ప్రశ్నించారు. బాధితురాలి వస్తువులు, డబ్బులు తీసుకోవడం, వాటిని ఎక్కడ భద్రపరిచారనే కోణంలో నిందితులను పదే పదే ప్రశ్నిస్తూ సమాధానాలు రాబట్టారు. అనంతరం గ్రామంలోని వారి ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నిందితులను చూసిన వారి కుటుంబ సభ్యులు రోదించారు. పోలీసులు వారితో మాట్లాడనీయలేదు. సాదిక్‌బాబా భార్య, పిల్లలతో కలిసి పెద్దపెట్టున రోదించడంతో రెండు నిమిషాలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. అనంతరం సంఘటన జరిగిన రోజు నిందితులు ధరించిన దుస్తులు, మూడు బైకులు, కొంత నగదును పంచాయతీ కార్యదర్శి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.

### చిరుతలను పట్టుకునేందుకు బోన్ల ఏర్పాటు


సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న సెక్షన్ అధికారి వెంకటేశ్

నవాబ్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల దేవరగుట్టలో ఆవాసం ఏర్పరుచుకున్న చిరుతలు గ్రామస్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిరుతలు పొలాల వద్ద కాపలా ఉన్న కుక్కలను చంపి తింటుండటం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. గ్రామానికి చెందన ఎర్రకిష్టయ్య లేగదూడ గురువారం రాత్రి కనిపించకుండా పోయింది. దానిని చిరుతలు ఎత్తికెళ్లినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈ విషయంపై సెక్షన్ అధికారిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, పూర్తి వివరాలను తెలుసుకుంటామని చెప్పారు. చిరుతలను పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు దేవరగుట్టలోని తేనెగుండు సమీపంలో సీసీ కెమెరాలు, బోన్లను ఏర్పాటు చేశారు.


దోమలపెంటలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం

## తలాపున కృష్ణమ్మ..

# తాగు నీరు లేదమ్మా!

» దోమలపెంట, ఈగలపెంట ప్రజల ఆవేదన
» ఆరేళ్లుగా కొనసాగుతున్న 'మిషన్ భగీరథ' పనులు
» యాభై ఏళ్లుగా నెట్టుకొస్తున్న అధికారులు
» పగిలిన పైపులు, పాకర పట్టిన సంపులు
» పది రోజులకు ఒకసారి నీటి సరఫరా

దోమలపెంట ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తలాపునే కృష్ణమ్మ పారుతున్నా.. తాగునీరు అందడం లేదు. పది రోజులకో సారి సరఫరా చేస్తున్న నీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది' అని ఆ రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులో, శ్రీశైలానికి వెళ్లే దారిలో, కృష్ణానదికి సమీపంలో ఉన్న దోమలపెంట, ఈగలపెంట గ్రామాల దుస్థితి ఇది. 1966లో శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో అధికారులు, కార్మికులు, కూలీల ఆవాసం కోసం ప్రాజెక్టు కాలనీలుగా ఏర్పాటైన ఈ ఊర్లు కాలక్రమంలో గ్రామపంచాయతీలుగా మారాయి. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కాలనీల నిర్వహణ, నీటి సరఫరా కొనసాగుతుండేది. తాగునీరు సరఫరా కోసం కృష్ణానది నుంచి ఈ కాలనీలకు ఏర్పాటు చేసిన పైపు లైన్ ప్రస్తుతం దెబ్బతిన్నది. దానినే మరమ్మతు చేస్తూ అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారు. నీటిపారుదల శాఖలో గతంలో 18 మంది ఉద్యోగులు ఉండేవారు. ప్రస్తుతం ఒక ఇంజనీరు, ఒక సహాయకుడు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం దోమలపెంట, ఈగలపెంట గ్రామాలకు జెన్‌కో అధ్వర్యంలో కృష్ణానది నుంచి మృగవాణి అతిథి గృహం వరకు నీరు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి దోమలపెంటకు 10 రోజులకు ఒక సారి నీరు అందిస్తున్నారు. గ్రామంలో ఉన్న బోర్ల ఉంచి అప్పుడప్పుడు నీటిని సరఫరా చేస్తున్నారు.



#### తాగునీరు లేక ఇబ్బందులు



తాగు నీటి కోసం పది సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నాం. సమస్య పరిష్కరించాలని అధికారులు, నాయకులకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేదు. దాతలు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తుండటంతో కొంత ఊరట కలుగుతోంది. అధికారులు స్పందించి ప్రతీ రోజు తాగునీరు సరఫ రా చేసేలా చర్యలు తీసుకోవాలి.

- గాలెమ్మ, దోమలపెంట

#### ఎమ్మెల్యే చొరవ చూపాలి



గత ప్రభుత్వం మిషన్ భగిరథ పథకం ఏర్పాటుకు నిధులను కేటాయించింది. ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. గత ఏడాది నుంచి కాంట్రాక్టర్ పనులు సక్రమంగా చేయకపోవడం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మిగతా పనులు పూర్తి కావడం లేదు. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి సమస్యను పరిష్కరించాలి.

- బుదాల ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్, దోమలపెంట

#### 3 నెలలో పనులు పూర్తి



మిషన్ భగీరథ పనులను 3 నెలల్లోగా పూర్తి చేసి దోమలపెంట, ఈగలపెంట గ్రామాలకు నీరు సరపరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

సపోర్టు దిమ్మెలు కట్టకుండా వదిలేసిన పైపు లైన్

#### పూర్తికాని 'మిషన్ భగీరథ' పనులు

దోమలపెంట, ఈగల పెంట గ్రామాల్లో ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటిని అందించేందుకు 2020లో రూ. 6.58 కోట్ల నాబార్డు నిధులతో మిషన్ భగీరథ పథకం పథకానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కృష్ణానది నుంచి దోమలపెంట వరకు 3.5 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేసి, గ్రామంలో ఇంటింటికీ నల్లాలు బిగించి తాగునీరు అందించాలన్నది పథకం ముఖ్య ఉద్దేశం. అందుకు అనుగుణంగా ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులను అప్పగించింది. 2023, ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా, నేటికి పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నాసిరకమైన పైపులను వేయడంలో ఇప్పటికే జాయింట్లు ఊడిపోయాయి. ఇళ్ల ముందు ఇష్టానుసారంగా పైపులు వేయడంతో వాటిపై నుండి కార్లు, బైకులు తిరిగి నలిగిపోయాయని, మరికొన్ని చోట్ల విరిగి పోయాయని స్థానికులు చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో దోమలపెంటకు చెందిన కటకం వెంకటేశ్, రాములమ్మ ఫౌండేషన్ ద్వారా స్థానికులకు తాగునీరు సరపరా చేస్తున్నారు. ఇంటికి రెండు డ్రమ్ముల నీటితో పాటు, మూడు బబుల్స్ ఫిల్టర్ నీటిని అందిస్తున్నారు.


నీటి సంపులో పేరుకుపోయిన పాకర

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» మక్తల్ సీఐ రాంలాల్
» రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సీఐ రాంలాల్

మక్తల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మక్తల్ సీఐ రాంలాల్ అన్నారు. షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా, మక్తల్ మినీ స్టేడియంలో శుక్రవారం సబ్‌జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి సీఐతో పాటు, షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గతంలో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి, ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థినులు దివ్య, ప్రవీణ, లక్ష్మి, మేఘన, విశ్వాస, కౌసల్య, గాయత్రి, మధుప్రియ, అఖిల, శ్రావణిలను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన షూటింగ్‌బాల్ పోటీల్లో, బాలికల విభాగంలో మేఘన, విశ్వాస, కౌసల్య, మల్లీశ్వరి, అఖిల శ్రావణి, మధుప్రియ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో రాజేశ్, శివ, జగదీశ్, మణికుమార్, యుగంధర్, రహీం, గణేష్, వెంకటేశ్ ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 27 వరకు నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండలం, బిజ్వార్ గ్రామంలో డాక్టర్ ఆదిత్య పరాశ్రీ శక్తిపీఠంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో సత్యఅంజనేయులు, ప్రధాన కార్యదర్శి గణేష్‌కుమార్, పీడీ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఈటీలు స్వప్న, అనిత, రాఘవేందర్, రమేశ్, భీంరెడ్డి పాల్గొన్నారు.

### 20న హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి మహిళా జట్టు ఎంపిక పోటీలను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు హ్యా ండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సయ్యద్ తఖీయొద్దీన్, శంకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఆదిలా బాద్ జిల్లాలో ఈ నెల 29, 30తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 9 గంటలకు స్టేడి యం మైదానంలో ఒరిజనల్ ఆధార్‌కార్డుతో రిపోర్టు చేయాలని కోరారు.

# చివరి రక్తపు బొట్టు వరకు బీసీల కోసమే

» ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
» నాగర్‌కర్నూల్‌లో బీసీ జన చైతన్య సభ



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ జన చైతన్య సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీర్మార్ మల్లన్న


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ జన చైతన్య సభకు హాజరైన బీసీలు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పదవులపై ఎప్పుడూ ఆశ పెట్టుకోలేదని, తన చివరి రక్తపు బొట్టు వరకు బీసీల కోసమేనని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఇక ముందు ఎట్టి పరిస్థితిల్లోనూ అగ్రకుల పార్టీలకు సేవ చేసేది లేదని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్ హాలులో, బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ జన చైతన్య సభ నిర్వహించారు. పూలే ట్రస్టు వ్యవస్థాపకుడు పచ్చిపాల సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, అతిథులుగా బీసీ జన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్‌యాదవ్, విశ్రాంత డీఈవో ప్రొఫెసర్ శివార్చక విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం మొత్తం పంచాయతీ మొదలైందని, అగ్రకుల నాయకుల గోత్రం, పుట్టు పూర్వోత్తరాలతో సహా తాను బయటపెట్టానన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేయొద్దని, కాదని ఉద్యోగాల భర్తీకి పోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుర్చీ వచ్చే ఎన్నికల దాకా ఉండదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనా అనుభవం లేదని, కేవలం మోసం, దగా, వంచనలో అనుభవం ఉందని విమర్శించారు. సీఎంకు ఉన్న లలితకళలను ఉపయోగించి తప్పుడు కులగణనతో బీసీలను తక్కువగా చూపించారని ఆరోపించారు. బీసీలంటే తక్కువ కాదని, బీసీలంటే బిగ్గెస్ట్ క్లాస్ అన్నారు. బీసీ కులాలన్నీ ఒక్కటై మన కుర్చీలను మనం తీసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ బీసీ డిక్లరేషన్‌ను ప్రవేశపెట్టారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా బీసీ రచ్చబండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుంకర రమాదేవి రాసిన భారత రాజ్యాంగ పుస్తకాలను విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ సుదగాని హరిశంకర్‌గౌడ్, రాష్ట్ర సమన్వయకర్త వట్టె జానయ్యయాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బైకని శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చీర్ల భాస్కర్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, గెస్టు లెక్చరర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందంగౌడ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు లాలుయాదవ్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, డీటీయూ జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు ఓర్సు బంగారయ్య, తీన్మార్ మల్లన్న టీం పరశురాం, శివ పాల్గొన్నారు.

### ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్‌సీ డీవో

కల్వకుర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పటణంలోని డిగ్రీ కళాశాల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని డీఎస్‌సీ డీవో (డిస్ట్రిక్ట్ షెడ్యూల్డ్ కాస్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) శ్రావణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బందిలో ఒకరు విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, అతడిపై చర్యలు తీసుకోవాలని గురువారం రాత్రి వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఎస్‌సీ డీవో హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మద్యం తాగి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించిన క్యాటరింగ్ ఏజెన్సీ కింద పని చేస్తున్న ఉద్యోగి శ్రీశైలంను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకర్‌రెడ్డి ఉన్నారు.

### మంత్రాలయం పీఠాధిపతికి ఆహ్వానం


పీఠాధిపతికి ఆహ్వానపత్రికను అందిస్తున్న గ్రామస్థులు

నారాయణపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ నర్సచలం భూవేంకటేశ్వర ఆలయ సువర్ణ మహోత్సవాల పత్రికను శుక్రవారం రాత్రి మంత్రాలయంలో పీఠాధిపతి సుభు దేంద్ర తీర్థులకు అందించారు. ఈ నెల 28 నుంచి మే 4వ తేదీ వరకు జరిగే ఉత్సవాల ప్రారంభం రోజు పీఠాధిపతి 28న కోటకొండకు వస్తారని తెలిపారు. ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, పలువురు పీఠాధిపతుల రాక, ప్రత్యేక హోమాలు, గాన కచేరీ, సంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగనున్నాయి. సీతారామారావు, అనిల్ దేశాయి శ్రీను, శేషు, భరత్ పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని సాయివంశీ కాలనీకి చెందిన క్రాత్రావత్ తిరుపతి అదృశ్యం అయినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు, బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. ఆచూకీ తెలియకపోవడంతో అతడి భార్య శారద శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.


సదా మీ సేవలో..



అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

| | |
|---|---|
| గద్వాల జిల్లా | :9985404383 |
| మహబూబ్‌నగర్ జిల్లా | : 8096677362 |
| నాగర్‌కర్నూల్ జిల్లా | :8374394441 |
| నారాయణపేట జిల్లా | :9985456557 |
| వనపర్తి జిల్లా | :9010937550 |

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.

సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

## న్యూస్ బాక్స్

### డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించాలి



మాట్లాడుతున్న కుతుబ్

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అత్మకూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను పునర్ ప్రారంభించాలని ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ కుతుబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో డయాలసిస్ పేషెంట్‌తో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మూడు నెలల కిందట రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించి ఒక్క రోజు కూడా సెంటర్‌ను నిర్వహించకుండానే ఆయా పరికరాలతో సెంటర్‌ను ఎత్తివేయడం సరైంది కాదన్నారు. ఈ ప్రాంత ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డయాలసిస్ పేషెంట్లు పాల్గొన్నారు.

### బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో విద్యకు దూరమైపోతున్న విద్యార్థులను బడిలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావాజీపల్లి పాఠశాల ఉపాధ్యాయ బృందంతో నూతన విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కోసం ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడి ఈడు కలిగి బడి బయట ఉన్న పిల్లల తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాల విశిష్టతను తెలియజేశారు. తమ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉచితంగా ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన బోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కురుమూర్తి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, లక్ష్మణ్, పరమేశ్వరి, భాగ్యశ్రీ, శరణ్య, తదితరులు పాల్గొన్నారు.

### మక్తల్ ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం మక్తల్ యూత్ నాయకులు తులసిరాజ్ మాట్లాడారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. అలాగే ప్రస్తుతం ముదిరాజ్ సామాజిక వర్గాన్ని వేదికగా చేసుకుని కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీ మంత్రి వర్గంపై అసత్య ప్రచారాలు మక్తల్ ఎమ్మెల్యే చేసినట్లుగా ఆరోపణలు సృష్టించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోవాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చేసే ప్రచారాన్ని తట్టుకోలేరని హెచ్చరించారు. అనంతరం అసత్య ప్రచారాలకు ఒడి గట్టిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తు ఆత్మకూరు స్టేషన్ ఎస్ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, సీనియర్ నాయకులు రహమ తుల్లా, మొగిలి గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, భాస్కర్, వెంకట్ నరసింహ రావు, మణివర్ధన్ రెడ్డి, సాయి రాఘవ, దామోదర్, నగేష్, శ్రీనివాసులుతో పాటు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

చిన్నంబావి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చిన్నంబావి, వీపనగండ్ల మండలం, సంపత్‌రావుపల్లిలో ఉపాధి పని ప్రదేశంలో వ్యవసాయ కూలీల సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. 8 వారాల నుంచి పనులు చేస్తున్న కూలీలకు నేటికీ డబ్బులు ఇవ్వలేదని అన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజు కూలీ రూ.600 ప్రతీ మనిషికి వంద రోజుల పని కల్పించాలని, నిరంతరం పెంచుతున్న బంగారు ధరలను తగ్గించాలని పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాలని కోరారు.

# ప్రమాదకరంగా సెల్‌ఫోన్ ప్రయాణం

» సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు » కంట పడితే చర్యలు తప్పవంటున్న పోలీసులు

ప్రమాదం చెప్పిరాదు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వినియోగించకూడదని పోలీస్ అధికారులు చెబుతున్నా.. ప్రజల్లో మార్పు రావడం లేదు. ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం అలుముకుంటోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులపై వాహనదారులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్తున్న ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ వనపర్తి జిల్లా





పాతబస్టాండ్ నుంచి రాజీవ్ చౌరస్తాకు వెళ్తున్న దారిలో... పాతబస్టాండ్ వెళ్తే దారిలో ఇలా..

## జిల్లాకు చేరుకుంటున్న పాఠ్య పుస్తకాలు



పాఠ్యపుస్తకాల గోదామును పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వనపర్తి జిల్లాలోని విద్యార్థులకు పార్ట్ 1 పుస్తకాలు మే చివరి నాటికి 2,60,189 పుస్తకాలు రావాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 24 శాతం 62,280 పుస్తకాలు జిల్లా కేంద్రంలోని గోదాంకు చేరుకున్నాయని ఎస్‌టీ బుక్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. పూర్తిస్థాయిలో పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరిన వెంటనే మండల కేంద్రాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు తరలించి విద్యార్థులకు అందజేస్తామన్నారు. పుస్తకాలు భద్రపరిచే గోదామును జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనితో పాటు జిల్లా అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

## కల్లానికి ధాన్యం వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలి



పెద్దగూడెం తండాలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ధర్మ నాయక్

వనపర్తి రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతు పంట పండించి కల్లానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ధర్మ నాయక్ కోరారు. శుక్రవారం వనపర్తి మండల పరిధి లోని పెద్దగూడెం తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పది రోజుల నుంచి అకాల ఈదురు గాలులు వస్తున్నాయని కల్లాలకు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. అకాల వర్షం వస్తే చాలా మంది రైతుల వద్ద ధాన్యాన్ని తడవకుండా ఉంచేందుకు కవర్లు అందుబాటులో లేవని అన్నారు. సంబంధిత అధికారులు దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నారాయణ నాయక్, టిక్యా నాయక్, గోపాల్, సూర్యనాయక్, చందు నాయక్, రవీందర్ నాయక్, తదితరులు ఉన్నారు.

రేవల్లి : ఏదుల మండలంలోని చెన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఉమ్మడి గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, సేద తీరేందుకు రైతులకు నీడ కల్పించాలని, తేమ నిర్ధారణ విషయంలో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. రాంచందర్, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ మండలాన్ని అభివృద్ధి చేయాలి

**బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



మార్నింగ్ వాక్ చేస్తున్న రాచాల యుగంధర్ గౌడ్

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి నోచుకోని శ్రీరంగాపూర్ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కోరారు. శుక్రవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో రాచాల మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఉదయం మండల కేంద్రానికి చేరుకున్న రాచాలకు నాయకులు డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్, భగీరథ, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి స్థానిక ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ గ్రామంలోని అన్ని వార్డుల్లో నడక సాగించి రంగనాయక స్వామి ఆలయంలో ముగించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడారు. మండల కార్యాలయాలు లేక ప్రజలు, ఉద్యోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వాటిని నిర్మించాలన్నారు. దర్మేంద్ర సాగర్, అస్కని రమేష్, నాయకులు పాల్గొన్నారు.

## సోలీపూర్‌లో నేడు రథోత్సవం





లక్ష్మీ నరసింహ స్వామి మూలవిరాట్: సోలీపూర్ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ముఖద్వారం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోలీపూర్ దత్త పీఠం శ్రీ దత్తాత్రేయ శ్రీరామదూత శ్రీలక్ష్మి నరసింహస్వామి యోగానంద సద్గురు స్వాముల వారి సప్తాహ సహిత ఆరాధన ఉత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం ఆలయంలో ఆరాధన ఉత్సవం, సాయంత్రం ఎద్దులతో బండలాగుడు పోటీలు, రాత్రి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రవీందర్ రెడ్డి తెలిపారు. స్వామి వారి ఆలయంలో భక్తులు అఖండ భజనలతో పాటు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. ఎద్దులతో బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. బండలాగుడు పోటీల్లో విజేతలకు రూ.1,20,000 వరకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం యోగానంద నరసింహ స్వామి పల్లకీ సేవ, రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయం ఆవరణలో తినుబండారాల, బొమ్మల దుకాణాలు వెలిశాయి.

### సభను విజయవంతం చేయాలి

వీపనగండ్ల, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిందన్నారు. తాను శిలాఫలకాలు వేసిన పనులను చేపట్టడం లేదన్నారు. తమ విధానాలను మార్చుకోకుంటే రాబోయే కాలంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మహాసభకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ కమలేశ్వరరావు, సత్యనారాయణగౌడ్, మల్లయ్య, శివ సర్దార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతీ రోజు తప్పకుండా వ్యాయామం చేయాలి



సిబ్బందితో కలిసి వ్యాయామం చేస్తున్న ఎస్పీ

వనపర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది ప్రతీ రోజు తప్పకుండా వ్యాయామం చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో వ్యాయామ శాలను ప్రారంభించి మాట్లాడారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధి నిర్వహణలో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సమయం దొరికినప్పుడు సమయాన్ని వృథా చేయకుండా ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయాలని సూచించారు. చిన్న వయసులోనే చాలా మంది అనారోగ్యానికి గురై తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ మాగ్దుమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులకు పరీక్షలు

వవనపర్తి రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని చిట్యాల గ్రామ శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు 6, 7, 8, 9వ తరగతులకు శనివారం పరీక్ష ఉంటుందని ఆర్‌సీవో శ్రీనివాస్, డీసీవో మేఘ, పాఠశాల ప్రిన్సిపాల్ గురువయ్య గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థి హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకుని ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరగబోయే పరీక్షలకు హాజరుకావాలని అన్నారు.

### వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కొత్తకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లింల నిరసన ర్యాలీకి సీపీఎం జిల్లా నాయకులు జబ్బార్, నిక్సన్, సామాజిక కార్యకర్త డేవిడ్‌రాజ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ముస్లి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఫారుక్ హుసేన్, ఐఎంఐ జిల్లా అధ్యక్షుడు రహీం, నాయకులు లతీఫ్, సలీంఖాన్, సుల్తాన్, అబ్దుల్ గఫార్, ఖదీర్‌ఖాన్, సయ్యద్ లాల్, బాబా, తయ్యుబ్, మోసిన్, మౌలానా, అస్లం, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు సాగర్

కొత్తకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన పోతులపల్లి అద్విక్ సాగర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి రూ.1,01,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. విరాళం అందజేసిన దివంగత అద్విక్ సాగర్ కుటుంబ సభ్యులు శ్రీనివాసులు దంపతులను ఆలయ నార్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వినోద్, నాగరాజు, అనిల్ కుమార్, గంగాధర్, కిషోర్ కుమార్, సత్యం సాగర్, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం



ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే నా ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా క్యాంపు కార్యాలయంలో పెబ్బేరు మండలం ఎటిగడ్డ శాఖపూర్‌కి చెందిన కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కావలి గోవిందు నాయుడు గ్రామ అభివృద్ధిపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో భాగంగా గ్రామానికి 30 ఇళ్లు మంజూరయ్యాయని, వీటితో పాటు మరో 10 ఇళ్లు అదనంగా ఇవ్వాలని కోరారు. కేశవ్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

**విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి**

పెబ్బేరు : విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషిచేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కోరారు. శుక్రవారం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో వనపర్తిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. పెబ్బేరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. నాగభూషణం, బ్రహ్మం, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, గోవిందు తదితరులున్నారు.

## ధారాసింగ్‌కు అంబేడ్కర్ ఎక్సలెన్సి అవార్డు



అవార్డును అందుకుంటున్న ధారాసింగ్

పెబ్బేరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికలో శుక్రవారం వివిధ రంగాల్లో సేవలందించిన సామాజిక కార్యకర్తలకు డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఎక్సలెన్సి అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగా చిన్నంబావి మండలం బెక్కెం గ్రామానికి చెందిన ధారాసింగ్ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు రామచంద్రు నాయక్, దైవజ్ఞ శర్మ, ఆనంద్ మూర్తి, రాపోలు భాస్కర్, రఘురామ రావు, పాండు, కె.ఈశ్వరాచారి పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

పెబ్బేరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీ కేంద్రంలో శుక్రవారం చలో వరంగల్ వాల్‌పోస్టర్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 16 నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మీరు చెప్పిన మాయమాటలను నమ్మిన ప్రజలు మోసపోయి గోసపడుతున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజాక్షేత్రంలో ఎండగడుతామన్నారు. 27న నిర్వహించనున్న రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో ప్రజలను తరలించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సత్యారెడ్డి, రాజశేఖర్, వెంకటేష్, మాధవరెడ్డి, మొగులన్న, కిషోర్ కుమార్ రెడ్డి, వడ్డే రమేష్, మన్యం, మూర్తి, వీరస్వామి, కొండల్ తదితరులున్నారు.

### అమావాస్యకు పంచముఖి ఆంజనేయ స్వామికి ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 27న వనపర్తి ఆర్టీసీ డిపో నుంచి పంచముఖీ ఆంజనేయస్వామి దేవస్థానానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు 27న మధ్యాహ్నం ఒంటి గంటకు వనపర్తి నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు పంచముఖీ దేవాలయానికి చేరుకుంటాయని పేర్కొన్నారు. దేవాలయ దర్శన అనంతరం మంత్రాలయం వెళ్లి దర్శనం తరువాత తిరిగి మంచముఖి చేరుకుని, అదేరోజు రాత్రి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు వనపర్తికి చేరుకుంటాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు ముఖ్యంగా ఎలక్ట్రికల్ వైర్స్ సమస్యలు తలెత్తుతూ ఉంటాయని, ఐసీయూలో ఉండే వివిధ రకాల పరికరాలను తగు రీతిలో ఉపయోగించకుండా తప్పిదం చేయడంతో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ముందుగా ఆసుపత్రికి ఉన్న మెయిన్ విద్యుత్ కనెక్షన్ నిలిపివేసి దగ్గరలోని ఆక్సిజన్ సీవో2 ద్వారా మంటలను అదుపు చేస్తూ.. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, కృష్ణ, రాముడు, భీమేశ్వర్ రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

## దరఖాస్తుదారులకు ఇళ్లు మంజూరు చేయాలి

పాన్‌గల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ పేదవాడికి ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్య నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 11,776 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల కాలంలో 69 మంది ఓటర్ల ప్రకారం ఒక ఇల్లు మంజూరు చేయాలని నిబంధన పెట్టిందని, దీని ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి 21వ తేదీ వరకు ఎంపిక చేసి లిస్టును అందజేయాలని ప్రభుత్వం చెప్పడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు జములయ్య, భీమయ్య, సూర్యవంశం రాము, కృష్ణయ్య, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి కోసమే సిలువ ఎక్కిన ఏసు

- కల్వరి టౌన్ చర్చి పాస్టర్ రెవరెండ్ జాన్‌రాజ్
- గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు



సువార్తను బోధిస్తున్న పాస్టర్ జాన్‌రాజ్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మానవాళి విశ్వశాంతి కోసమే ఏసు క్రీస్తు సిలువ ఎక్కి రక్తం చిందించాడని కల్వరి టౌన్ చర్చి పాస్టర్ రెవ జాన్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో క్రైస్తవులు పవిత్ర శుక్రవారాన్ని (గుడ్‌ఫ్రైడే) భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక వాఖ్యాలు బోధించారు. ఏసుప్రభువు చిందించిన ప్రతీ ఒక్క రక్తపు చుక్క మనుషులను పాపాల నుంచి విముక్తి పరిచేందుకేనన్నారు. గుడ్‌ఫ్రైడే వేడుకల్లో కల్వరి టౌన్ చర్చి సెక్రెటరీ గంధం ప్రసాద్, రంగస్వామి, యాకోబు, ఎంబీ ఓలివ చర్చి పాస్టర్ రెవ ఎస్ఎం జానప్ప, సుకన్య, రోనాల్డ్, అమృత్‌సాగర్, రెవ తిమోతి, విల్సన్, జాషువా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆత్మకూరు : గుడ్ ఫ్రైడే వేడుకలను ఆత్మకూరు మండలంలోని మూలమల్ల జూరాల, మేడపల్లి, మోట్లంపల్లి, ఆరేపల్లి, రేచింతల, ఖానాపూర్ గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల్లలో పాస్టర్ విద్యాసాగర్ ఏసుక్రీస్తు చేసిన బోధనలను వివరించారు. ఏసుక్రీస్తు సిలువపై శుక్రవారం మృతిచెంది ఆదివారం వేకువజామున పునరుద్ధరణ అవుతున్నందున గుడ్ ఫ్రైడేను శుభ శుక్రవారంగా క్రైస్తవులు జరుపుకుంటారన్నారు. జర్మియ ధనరాజ్, డేవిడ్, సుమన్ పాల్గొన్నారు.



మూలమల్ల గ్రామంలోని ఎంపీ శాలెం చర్చిలో ఏసుక్రీస్తు బోధనలు చేస్తున్న పాస్టర్ విద్యాసాగర్

**ఏసు సద్గుణాలను ఆచరించాలి**

అమరచింత : ప్రతీ ఒక్కరు ఏసు ప్రభు ఆచరించిన సద్గుణ మార్గాలను ఆచరించి ప్రేమ సోదర భావాన్ని పెంపొందించాలని అమరచింత ఎంపీ పాస్టర్లు హ్యాపీపాల్, హనోక్‌లు పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం అమరచింత ఎంబీ కార్మెల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం మాట్లాడారు. ఏసు ప్రభు మానవాళికి చాటిన కరుణ, ప్రేమ మానవీయతలను ప్రతీ ఒక్కరు గుర్తుంచుకోవాలని కోరారు. ఎంబీ కార్మెల్ చర్చి సంఘ సభ్యులు శ్రీనివాసులు, దీన కుమార్, విజయ్, ప్రకాశం ఉన్నారు.



అమరచింతలో ఏసు ప్రభు బోధనలను వివరిస్తున్న పాస్టర్